నేటి కందం- నేటికి అందం

శ్రేయమ్ముల నిదు ఇస్రో
ఖాయమ్ముగు సేవ లొసగ కర్మ నొనర్పన్
సీయమ్మెస్ జీరో త్రీ
సాయకమై నింగి కెగిరె జయకేతనమై !!

(ఇస్రో సంస్థ చేపట్టిన సీ యం యస్ జీరో త్రీ ఉపగ్రహం నింగిలోనికి విజయవంతంగా దూసుకెళ్లింది. ఈఖ్యాతి భారతీయు లందరిది అని మోడీ అన్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

చురక

ఓటు కొరకు డబ్బులు
ఒక్కరోజే ఇస్తారు
గెలిచినంకా ఐదేళ్ల
గంపగుత్త దోస్తారు.
జూబ్లీలో ఎటుచూసిన
జనం పైన ఇదే వల
ప్రలోభాల్లో మునుగి ఓటు
పవర్ తీస్తే విలువ ఎలా



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 4-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:68 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రజలతో మమేకమవ్వడం, క్షేత్ర స్థాయిలో సేవ చేసే అవకాశం దక్కడం గొప్ప అదృష్టం: రాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 3:ఉత్తరాఖండ్ రాష్ట్రం ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నేడు (నవంబర్ 3, 2025) డెహ్రాడూన్‌లో రాష్ట్ర శాసనసభను ఉద్దేశించి రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన పార్లమెంటరీ వ్యవస్థలో శాసనసభలు కీలకపాత్రను పోషిస్తాయని అన్నారు. పార్లమెంటరీ వ్యవస్థను స్వీకరించడం ద్వారా నిరంతర బాధ్యతయుత పాలనకు రాజ్యాంగ రూపకర్తలు అధిక ప్రాధాన్యత ఇచ్చిన సంగతిని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వెల్లడించారని గుర్తుచేశారు. ప్రజల విషయంలో బాధ్యతగా ఉండటం పార్లమెంటరీ వ్యవస్థకు మేలు చేసేదేగానీ, కానీ అది పెద్ద సవాలని శ్రీమతి ద్రౌపది ముర్ము తెలిపారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య శాసన సభ్యులు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తారని రాష్ట్రపతి పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవడం, వారికి అట్టడుగు స్థాయిలో సేవచేసే అవకాశం లభించడం గొప్ప గౌరవమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యేలు చురుకుగా పాల్గొని, వారి సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు, ప్రతినిధులకు మధ్య ఉన్న నమ్మకం విడదీయరానిదని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించాలని ఉత్తరాఖండ్ శాసనసభ సభ్యులకు రాష్ట్రపతి సూచించారు. ఇలాంటి పనులు పార్టీ రాజకీయాలకు అతీతంగా ఉంటుందని ఆమె అన్నారు. సమాజంలోని బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం సున్నితత్వంతో పనిచేయాలని సూచించారు. యువతకు అభివృద్ధి అవకాశాలను కల్పించడం కూడా ప్రాధాన్యతగా పరిగణించాలని రాష్ట్రపతి తెలిపారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ప్రకారం.. పౌరులందరి కోసం ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలనే నిబంధనను మన రాజ్యాంగ నిర్మాతలు ఏర్పాటు చేశారని రాష్ట్రపతి తెలిపారు. రాజ్యాంగంలోని ఆ దిశానిర్దేశానికి అనుగుణంగా ఉమ్మడి పౌరస్మృతి బిల్లును అమలు చేసినందుకు ఉత్తరాఖండ్ శాసన సభ్యులను రాష్ట్రపతి ప్రశంసించారు. ఉత్తరాఖండ్ శాసనసభలో ఇప్పటి వరకు 550కి పైగా బిల్లులు ఆమోదం పొందాయని.. వాటిలో ఉత్తరాఖండ్ లోకాయుక్త బిల్లు, ఉత్తరాఖండ్ జమీందారీ రద్దు, భూ సంస్కరణ బిల్లు, కాపీయింగ్ నిరోధక బిల్లు వంటి ముఖ్యమైన చట్టాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. పారదర్శకత, నైతికత, సామాజిక న్యాయం ద్వారా స్ఫూర్తి పొందిన ఇలాంటి బిల్లులను ఆమోదించినందుకు ఎమ్మెల్యేలను ఆమె అభినందించారు.

ఉత్తరాఖండ్ అపూర్వమైన ప్రకృతి సంపద, సౌందర్యం కలిగి ఉన్న రాష్ట్రమని రాష్ట్రపతి అన్నారు. ప్రకృతి ప్రసాదించిన ఈ అందాలను కాపాడుకుంటూ రాష్ట్రం అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని ఆమె సూచించారు. గత 25 ఏళ్లలో ఉత్తరాఖండ్ ప్రజలు అద్భుత అభివృద్ధి సాధించారని ఆమె పేర్కొన్నారు. పర్యావరణం, ఇంధనం, పర్యాటకం, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో రాష్ట్రం ప్రశంసనీయ పురోగతిని సాధించిందని తెలిపారు. డిజిటల్, భౌతిక కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కూడా రాష్ట్రం ముందడుగు వేసిందని చెప్పారు. ఈ సమగ్ర అభివృద్ధి ప్రయత్నాల ఫలితంగా ఉత్తరాఖండ్ మానవ అభివృద్ధి సూచికలో అనేక ప్రమాణాల్లో మెరుగుదల సాధించిందని ఆమె పేర్కొన్నారు. 'దేశమే తొలి ప్రాధాన్యం' అనే స్ఫూర్తితో ఉత్తరాఖండ్ శాసనసభ్యులు రాష్ట్రాన్ని, దేశాన్ని వేగవంతమైన అభివృద్ధి దిశగా తీసుకెళతారనే నమ్మకం తనకుందని తెలిపారు.

## చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు సహా 21 మంది దుర్మరణం



చేవెళ్ల నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం ఉదయం చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు డ్రైవర్లు సహా 21 మంది దుర్మరణం చెందారు. మరికొందరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు అందులో కూరుకుపోయారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మూడు జేసీబీల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూరుకుపోయిన వారిని బయటకు తీస్తున్నారు. ఇప్పటివరకు 15 మందిని బస్సులోనుంచి బయటకు తీశారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. తాండూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. వారిలో ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తున్నది. విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు కాలేజీల్లో చదువుతున్నట్లు సమాచారం. బస్సుపై టిప్పర్ పడిపోవడంతో డ్రైవర్ వైపు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ప్రయాణికుల ఆర్తనాదాలతో ప్రమాద స్థలం హృదయవిదారకంగా మారింది. రోడ్డు ప్రమాదంతో హైదరాబాద్–బీజాపూర్ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. చేవెళ్ల–వికారాబాద్ మార్గంలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఘటనా స్థలానికి అంబులెన్స్‌కు కూడా చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది.

## హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం లోగోను ఆవిష్కరించిన గవర్నర్



హైదరాబాద్ నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఈ సంవత్సరం డిశంబరు 19 వ తేదీ నుండి 21వ తేదీ వరకూ ప్రసాద్ ఐమాక్స్‌లో జరగనున్న తొలి హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం లోగోను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ సోమవారం నాడు గవర్నర్ దర్బార్ హాలులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం ఛీఫ్ పాట్రన్ జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ దర్శకులు సి ఉమా మహేశ్వరరావు, లఘు చిత్రోత్సవ నిర్వాహకులు దాదా సాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీస్ ప్రిన్సిపల్ నందన్ బాబు, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ కార్యనిర్వహక అధికారి ప్రియాంకలు పాల్గొన్నారు. ఈ దర్భంగా గవర్నర్ మాట్లాడుతూ లఘుచిత్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశవ్యాప్తంగా పలు చలనచిత్రోత్సవాలు జరుగుతున్నా ఈ స్థాయిలో అంతర్జాతీయ లఘు చిత్రోత్సవం నిర్వహించబూనుకోవటం పట్ల గవర్నర్ నిర్వాహకులను అభినందించారు. హైదరాబాద్ సంస్కృతీ సాంప్రదాయాలకు ఈ లోగో దర్పణం పడుతోందని ఆయన ప్రశంసించారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో హైదరాబాద్‌కు విశేషమైన స్తానం ఉందని, ఈ లఘుచిత్రోత్సవాల ద్వారా నగరం కొత్తదనాన్ని సంతరించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల గురించిన ప్రాథమిక అవగాహన కల్పించేందుకు లఘుచిత్రాలు కీలకమైన సాధనంగా మారాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ దేశంలో ఈ స్థాయిలో లఘుచిత్రాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేకంగా మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించటం ఇదే మొదటిసారని, రానున్న కాలంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ చలనచిత్ర యవనికలో ఓ ప్రాధాన్యత కలిగిన కేంద్రంగా అభివృద్ధి చేయటానికి ఈ లఘుచిత్రోత్సవాలు ఉపయోగపడతాయని అన్నారు. రానున్న కాలంలో భారదేశంలోనే హైదరాబాద్‌ను చలనచిత్ర హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చలన చిత్ర అభివృద్ధి సంస్థ నిర్విరామంగా కృషి చేస్తోందని, దేశంలోనే అత్యధిక సంఖ్యలో ఫిలిం స్క్రీన్‌లు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆమె అన్నారు. ఈ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవాల నిర్వహణలో తెలంగాణ చిలన చిత్ర అభివృద్ధి సంస్థ ప్రధాన భాగస్వామిగా ఉండటం ఎంతో సంతోషించదగ్గ విషయమని, ఈ ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. లఘుచిత్రోత్సవం ఛీఫ్ పాట్రెన్ సి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, డిశంబరు 19 నుండి 21 మధ్య నిర్వహించబోతున్న ఈ లఘు చిత్రోత్సవాలు ఆధునిక ప్రపంచ సంస్కృతితో తెలంగాణ సంస్కృతి పెనవేసుకోవడానికి ఓ వేదికగా ఉంటుందనీ, తెలంగాణ రాష్ట్రంలో విస్తృతంగా సాంస్కృతిక ఉత్పత్తులు, లఘుచిత్రాలు నిర్మించే యువతకు ఈ ఉత్సవాలు అద్భుతమైన అవకాశాలను కల్పించనున్నాయని, ఈ సందర్భంగా సినీ రంగ నిపుణులతో జరిగే ప్యానెల్ చర్చల్లో చలన చిత్ర కౌశలానికి సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించనున్నట్లు ఉమా మహేశ్వరరావు తెలిపారు.

## ప్రైవేట్‌రంగంలో పరిశోధనలు ప్రోత్సహించేందుకు రూ.లక్ష కోట్లతో నిధి : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించారు. ప్రైవేట్ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా వాతావరణం కల్పించేందుకు రూ.లక్ష కోట్ల నిధిని ఉపయోగించనున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ సందర్భంగా ఐసీసీ వన్డే వరల్డ్ కప్ సాధించిన భారత జట్టును, బాహుబలి రాకెట్‌ను విజయవంతంగా నింగిలోకి పంపిన భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమం సైన్స్‌కు సంబంధించిందని.. కానీ తొలుత క్రికెట్‌లో భారత్ సాధించిన అద్భుతమైన విజయం గురించి మాట్లాడుతున్నానన్నారు. భారత మొత్తం తమ జట్టు సాధించిన విషయంతో సంతోషంగా ఉందని.. మహిళల జట్టు తొలి ప్రపంచకప్‌ని సాధించిందని.. ఇందుకు తాను మహిళా జట్టును హృదయపూర్వకంగా అభినందిస్తున్నాన్నారు. విజయాన్ని చూసి గర్విస్తున్నానని.. ఈ విజయం దేశంలోని కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.ఆ తర్వాత భారీ ఉపగ్రహాన్ని అత్యంత బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించినందుకు ఇస్రోను అభినందించారు. నిన్న భారత్ శాస్త్ర సాంకేతిక రంగంలో జెండా ఎగుర వేసిందని.. శాస్త్రవేత్తలు అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించారన్నారు. ఈ మిషన్, ఇస్రోతో సంబంధం ఉన్న శాస్త్రవేత్తలందరినీ తాను అభినందిస్తున్నానన్నారు. రూ.లక్ష కోట్ల నిధి ప్రైవేట్‌రంగంలో పరిశోధనలను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ రోజు శాస్త్ర సాంకేతిక ప్రపంచంలో కూడా గొప్పరోజని.. 21వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు కలిసి కొత్తతరం శాస్త్ర సాంకేతిక రంగాలకు మార్గదర్శకత్వం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన అభి వృద్ధి ఆవిష్కరణ పథకాన్ని ప్రారంభిం చామని.. దానికి రూ.లక్ష కోట్ల నిధిని కేటాయించామ న్నారు. 'రూ.లక్ష కోట్లు మోదీ వద్దే ఉంటుందని మీరు అనుకోవచ్చు. అందుకే మీరు చప్పట్లు కొట్టడం లేదు. ఈ లక్ష కోట్లు మీ కోసం (శాస్త్రవేత్తలు). ఇది మీ సామర్థ్యాలను పెంపొందించడానికి. ఇది మీ కోసం కొత్త అవకాశాలను తెరవడానికి. ప్రైవేట్ రంగంలో కూడా పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడమే మా ప్రయత్నం' అని పేర్కొన్నారు. భారతదేశం హై రిస్క్, అధిక ప్రభావ పరిశోధన ప్రాజెక్టులకు మద్దతు ఇస్తోందని ప్రధాని తెలిపారు. ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను సైన్స్ అండ్ టెక్నాలజీకి శక్తి కేంద్రంగా ఎదగడానికి ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి తమ ప్రభుత్వం గణనీయమైన సంస్కరణలను చేపట్టిందన్నారు.ఒక దశాబ్దంలో పరిశోధన వ్యయం రెట్టింపు అయ్యిందని.. మా ప్రభుత్వం ఆర్థిక నియంత్రణ, సముపార్జన విధానంలో గణనీయమైన సంస్కరణలు చేసిందని చెప్పారు.ఇది భారత్ ఆవిష్కరణ పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, వృద్ధి–అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడానికి ప్రభుత్వం అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించిందని తెలిపారు. దశాబ్దం కిందట భారత్‌లో మహిళలు దాఖలు చేసే పేటెంట్ల సంఖ్య ఏటా వంద కంటే తక్కువగా ఉండేదని.. ప్రస్తుతం ఈ సంఖ్య 5వేలకు పెరిగిందన్నారు. భారత్‌లో గాఇఓ విద్యను అభ్యసిస్తున్న వారిలో 43శాతం మంది మహిళలు ఉన్నారని.. ఇది ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ అని ప్రధాని వివరించారు.

## రాజకీయ దురుద్దేశంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పక్కకు పెట్టారు..సీఎం రేవంత్ ఫైర్



హైదరాబాద్, నవంబర్ 3:రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్ హయాంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు ను పక్కకు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిసంచలన వ్యాఖ్యలు చేశారు. తప్పులు చేసి.. అప్పులు చేసి దోపిడీ చేశారనే కారణంతోనే ప్రజలు బీఆర్ఎస్‌ని పక్కన బెట్టారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నేతలని క్షమించరని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ని తమ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ విషయంలో తమ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాంతంపై సీఎం రేవంత్‌రెడ్డి జియో ఫిజికల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నెవారిపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

### ఏ ప్రాజెక్టునూ కేసీఆర్ పూర్తి చేయలేదు..

గత పదేళ్లలో ఏ ప్రాజెక్టునూ కేసీఆర్ పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఆయా ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరం చెబుతోందని పేర్కొన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అలుసైపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉండి ఉంటే టన్నెల్ పనులు ఎప్పుడో పూర్తయ్యేవని చెప్పుకొచ్చారు. ఎస్ఎల్‌బీసీని గత కేసీఆర్ ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. కమిషన్లు రావని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 10 కిలోమీటర్లు కూడా టన్నెల్ పనులు పూర్తికాలేదని చెప్పుకొచ్చారు. టన్నెల్ పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కారణంతోనే గాలికొదిలేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు

కొడంగల్, నవంబరు3 : కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చింది అక్షయ పాత్ర ఫౌండేషన్ ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ని అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు ఇవాళ(సోమవారం) కలిశారు. నవంబరు 14వ తేదీన కొడంగల్‌లో నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో గ్రీన్ ఫీల్డ్ కిచెన్ నిర్మించనుంది అక్షయ పాత్ర ఫౌండేషన్.

గ్రీన్ ఫీల్డ్ కిచెన్‌లో వండిన భోజనాన్ని నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేయనుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి రూ.7 చొప్పున చెల్లిస్తోంది ప్రభుత్వం. అయితే, నాణ్యమైన భోజనం అందించేందుకు దాదాపు రూ.25లు ఖర్చు చేస్తోంది అక్షయ ఫౌండేషన్. తెలంగాణ ప్రభుత్వం చెల్లించే నిధులకు అదనంగా అయ్యే ఖర్చును భరించనున్నారు అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధుల సాయంతో ఈ పథకం అమలుకు అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ అందించే పథకం విజయవంతంగా అమలవుతుంది. 312 పాఠశాలల్లో దాదాపు 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయాన్నే అల్పాహారం అందిస్తున్నారు. అన్ని గ్రామాల్లో పిల్లలు, తల్లిదండ్రుల నుంచి ఈ పథకానికి అపూర్వ స్పందన వచ్చిందని.. ఈ పథకం దేశంలోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

## తెలంగాణ వాసులకు మరో బిగ్ అలర్ట్..

### – రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఇటీవలే మొంథా తుఫాన్ కారణంగా తెలంగాణలోని పలు జిల్లాలు చిగురుటాకులా వణికిపోయాయి. వరంగల్, హన్మకొండ జిల్లాలు నీట మునిగాయి. ఆ తుఫాన్ నుంచి జనాలు ఇప్పుడిప్పుడే మెల్లమెల్లగా కోలుకుంటున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ వాసులకు మరో బిగ్ అలర్ట్ వచ్చింది. హైదరాబాద్ వాతావరణ శాఖ రాష్ట్రానికి మరోసారి వర్ష సూచనలు జారీ చేసింది. రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం విదర్భ, ఆ పరిసర ప్రాంతంలో కొనసాగిన ఉపరితల ఆవర్తన ద్రోణి సోమవారం నాటికి బలహీనపడింది. ఈ కారణంగా తెలంగాణలోని పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే ఇప్పటికే భాగ్యనగరంతో సహా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో హైదరాబాద్ లో అకస్మాత్తుగా వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ట్రాఫిక్ లో ఇబ్బందులు పడ్డారు. మంగళ, బుధ వారాల్లో కూడా రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే మరికొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు), 30 నుంచి 40 కి.మీ. వేగం కలిగిన ఈదురు గాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మొంథా తుఫాన్రణంగా పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పంట పొలాలు నీట మునిగి.. రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నారు. ఇలాంటి నష్టం మరోసారి జరగకుండా రైతులు ముందస్తుచర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## డిజిటల్ అరెస్టు కేసుల్లో కఠిన శిక్షలు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: డిజిటల్ అరెస్టు కేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. చాలా విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అత్యున్నత న్యాయస్థానం షాక్ వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో బాధితులు సుమారు 3000 కోట్లు కోల్పోవడం పట్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లు తమకు తాము భద్రతా సిబ్బందిగా, కోర్టు అధికారులుగా, ప్రభుత్వాధికారులు పరిచయం చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆడియో, వీడియో కాల్స్‌తో బాధితులను పీడిస్తున్నారు. బాధితులను కాల్స్‌తో బందీలుగా చేసి .. డబ్బులు చెల్లించేలా వత్తిడి తెస్తున్నారు. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, ఉజ్వల్ భుయాన్, జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం డిజిటల్ అరెస్టు కేసులపై విచారణ చేపట్టింది. ఈ విషయంలో కోర్టుకు సూచనలు చేసేందుకు అమికస్ క్యూరీని నియమించారు. కేంద్ర హోంశాఖ, సీబీఐ సమర్పించిన రెండు నివేదికలను కోర్టు పరిశీలించింది. డిజిటల్ అరెస్టుతో బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు సుమారు మూడు వేల కోట్లు వసూల్ చేయడం షాకింగ్‌గా ఉందని, బాధితుల్లో సీనియర్ సిటిజన్లు ఉన్నారని, ఒకవేళ ఇలాంటి కేసుల్లో కఠినమైన ఆదేశాలు ఇవ్వకుంటే, ఈ సమస్య మరింత జఠిలంగా తయారు అవుతుందని ధర్మాసనం పేర్కొన్నది. జుడిషియల్ ఆదేశాలతో భద్రతా ఏజెన్సీలను బలోపేతం చేయాలని, ఇలాంటి కేసులపై ఉక్కుపాదం మోపాలని కోర్టు పేర్కొన్నది. డిజిటల్ అరెస్టుల కేసులపై నవంబర్ 10వ తేదీ మళ్లీ విచారణ చేపట్టనున్నారు. అమికస్ క్యూరీ ఇచ్చే సూచనల ఆధారంగా కొన్ని ఆదేశాలు ఇవ్వనున్నట్లు కోరింది.సిండికేట్ నేరగాళ్లు ఆఫ్‌షోర్ లొకేషన్ల నుంచి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని సీబీఐ తన రిపోర్టులో చెప్పినట్లు జస్టిస్ కాంత్ పేర్కొన్నారు. కేంద్రం, సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. కేంద్ర హోంశాఖకు చెందిన సైబర్ డివిజన్ ఇలాంటి కేసుల్ని డీల్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హర్యానాకు చెందిన ఓ మహిళ సీజేఐ బీఆర్ గవాయ్‌కి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసును వాదిస్తున్నారు. తప్పుడు కోర్టు ఆదేశాలను చూపిస్తూ నేరగాళ్లు ఫ్రాడ్‌కు పాల్పడినట్లు ఆమె ఆరోపించింది.

## రాష్ట్రంలో తుఫాన్ తో 5 లక్షల ఎకరాల్లో, 3 లక్షల మంది రైతులకు నష్టం

### –బిజెపి శాసనసభ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ (భువనగిరి) నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); రాష్ట్రంలో తుఫాన్ తో 5 లక్షల ఎకరాల్లో, 3 లక్షల మంది రైతులకు నష్టం జరిగిందని బిజెపి శాసనసభ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. భువనగిరిలో ఆయన మీడియా తో మాట్లాడుతూ రైతులు కన్నీరు కార్చుతుంటే ముఖ్యమంత్రి ముంబై లో సల్మాన్ ఖాన్ తో ఫోటోలు దిగటం తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని విమర్శించారు. రైతులకు నష్ట పరిహారం రాలేదు. ఎకరాకు 10 వేలు నష్టపరిహారం ఇస్తా అని ఇవ్వలేదు. జూబ్లీ హిల్స్ ఎన్నికల నేపథ్యంలో ఎకరాకు 10 వేలు ఇస్తా అంటున్నారు మొన్న జరిగిన మే నెలలో 55 వేల ఎకరాల్లో పంట నష్టం, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 2.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం. ఇప్పుడు తుఫాను తో చాలా నష్టం జరిగింది వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. గతంలో పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి, పంట నష్టం కు 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉండి ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు.

## శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతిని కలిసి ఆశీర్వచనం పొందిన బిజెపి సీనియర్ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); శృంగేరి పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతిని సైనిక్ పురి లో ఉన్న శ్రీ విజయ గణపతి దేవాలయం కుంబాభిషేకం సందర్భంగా సోమవారం స్వామి వారిని కలిసి విశేష ఆశీర్వచనం పొందిన బిజెపి సీనియర్ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ దంపతులు

# భరతమాత గుండెకాయ భారత రాజ్యాంగం

**(04 నవంబర్ 1948 : "రాజ్యాంగ ముసాయిదాను అధికారికంగా రాజ్యాంగ సభలో చర్చకు సమర్పించిన దినం" సందర్భంగా)**

రాజ్యాంగ ముసాయిదాను 21 ఫిబ్రవరి 1948 నాటికే పూర్తి చేశారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన 04 నవంబర్ 1948 రోజున రాజ్యాంగ సభలో అధికారికంగా రాజ్యాంగ ముసాయిదాను ప్రవేశపెట్టిన కీలక ఘట్టం తర్వాత రాజ్యాంగ ముసాయిదాపై తొలి పఠనం ప్రారంభమైనది. ఈ రోజున రాజ్యాంగ ముసాయిదాపై లోతైన చర్చలు, సవరణలు ప్రతిపాదించడం జరిగింది. నాటి రాజ్యాంగ సభ(కాన్స్టిట్యుయెంట్ అసెంబ్లీ)లో ప్రతి సభ్యుడికి రాజ్యాంగ ముసాయిదా కాపీని అందించారు. తదుపరి 04 నవంబర్ నుంచి 09 నవంబర్ 1948 వరకు మొదటి పఠనం జరిగింది. ముసాయిదాపై దాదాపు 10 రోజున పాటు చర్చలు జరిగిన పిమ్మట 17 నవంబర్ 1948 వరకు కొనసాగాయి. రాజ్యాంగ సభలోని నాటి సభ్యులు రాజ్యాంగ ముసాయిదాలోని పలు అంశాలపై చర్చలు జరిపి సూచనలు, సవరణలు తెలియజేశారు. తదుపరి వివిధ అధికారిక వాటాదారుల సూచనల ఆధారంగా కొన్ని సవరణలు కూడా జరిగాయి. భారత రాజ్యాంగాన్ని 2 ఏండ్ల 11 నెలల, 18 రోజుల్లో తయారు చేయడం జరిగింది. రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశం అయ్యింది. ఇందులో 114 రోజులు రాజ్యాంగ రాతప్రతిపై చర్చకు వెచ్చించారు. రాతప్రతిలో 7,635 సవరణలు ప్రతిపాదించగా, అందులో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది. భారత రాజ్యాంగాన్ని 26 నవంబర్ 1949న సభలో ఆమోదించారు. 24 జనవరి 1950న 284 మంది రాజ్యాంగ సభ్యులు చిరు జల్లు పడుతున్న శుభవేళ సంతకాలు చేసారు. 26 జనవరి 1950 రోజున భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వేళ మనం గణతంత్ర దినోత్సవాన్ని ప్రతి ఏట ఒక పరమ పవిత్ర పర్వదినంగా, ఘనంగా నిర్వహించుకుంటున్నాం. ఆ రోజున భారత రాజ్యాంగ సభ రద్దయి, తాత్కాలిక పార్లమెంట్‌గా మారింది. 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో కొత్త పార్లమెంట్ ఏర్పడింది.

**భారత రాజ్యాంగ మౌళిక స్వరూపం:**

స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని తయారు చేయడానికి ఒక రాజ్యాంగ సభ లేక రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఈ సభలో రాష్ట్ర శాసనసభల ద్వారా ఎన్నికైన సభ్యులు 292, భారత్ సంస్థానాల నుండి ఎన్నికైన సభ్యులు 93 మంది, ఛీఫ్ కమిషనర్ ప్రావిన్సుల ప్రతినిధులు నలుగురు కలిపి మొత్తం 389 మంది ఉన్నారు. రాజ్యాంగ సభ తొలి సమావేశం పార్లమెంట్ భవనంలో 09 డిసెంబర్ 1946న జరిగింది. జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య కృపలానీ, డా రాజేంద్రా ప్రసాద్, సరోజినీ నాయుడు, బి ఆర్ అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాలి సీతారామరాజు మొదలైన సభ్యులు ఉన్నారు. రాజ్యాంగ రాతప్రతిని తయారు చేయడానికి బి ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేసారు. భారత రాజ్యాంగంలో అవతారిక, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలు, కార్యనిర్వాహక వ్యవస్థ (ప్రభుత్వం, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలి), శాసన వ్యవస్థ (పార్లమెంట్, ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు, జిల్లా కోర్టు), రాష్ట్రాలు (శాసన సభ, శాసన మండలి, గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం), ఎన్నికల వ్యవస్థ (రాజకీయ పార్టీలు, లోకసభ, రాజ్యసభ, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రాష్ట్ర పార్టీలు, రాష్ట్ర శాసన సభ, రాష్ట్ర శాసన మండలి, స్థానిక సంస్థల ఎన్నికలు) లాంటివి పొందుపరుచబడ్డాయి.

**భారత రాజ్యాంగం : ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం:**

ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగం సగర్వంగా నిలుస్తున్నది. ఇందులో అవతారిక, 448 అధికరణాలు, 12 షెడ్యూళ్ళతో కూడిన మహా గ్రంథం మన రాజ్యాంగం. మొదట్లో అవతారికలా భారత దేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. తదుపరి జరిగిన 42వ రాజ్యాంగ సమరణ ద్వారా సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మార్చారు. నేటికి భారత రాజ్యాంగంలో మొత్తం 106 సవరణలు జరిగాయి. మొదటి రాజ్యాంగ సవరణ 1951లో జరుగగా, 106వ రాజ్యాంగ సవరణగా "నారీ శక్తి వందన్ చట్టం(చట్ట సభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు)" 2023లో జరిగింది.

భారత రాజ్యాంగం దేశ ప్రజలకు శాంతి, సమైక్యత, సంపద, సౌభాగ్యాలను అందించే మహా గ్రంథంగా మనకు మార్గనిర్దేశనం చేస్తున్నది. సమయానుకూలంగా, ప్రాధాన్యతాక్రమంలో భారత రాజ్యాంగంలో సవరణలు చేస్తున్నాం. రాజ్యాంగం గురించి తెలుసుకోవడం మాత్రమే ముఖ్యం కాదని, దానిని తూచా తప్పకుండా పాటించాలనా మరిచిపోరాదు. రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే భరతమాత పౌరులుగా జీవించే హక్కును కోల్పోతారు. భారతీయులకు పరమ పవిత్ర జీవన గ్రంథంగా భారత రాజ్యాంగం సదా పూజించబడాలి, ఆచరణ మార్గం చూపాలి.

–డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# గిరిజనుల గౌరవం, అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని ప్రస్తావిస్తూ తన ఛత్తీస్‌గఢ్ పర్యటన విశేషాలను పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 3:గిరిజనుల గౌరవం, ప్రగతి ప్రయాణం, ప్రజా సంక్షేమాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన ఛత్తీస్‌గఢ్ పర్యటన నుంచి పలు విశేషాలను పంచుకున్నారు.

'ఎక్స్' వేదికగా చేసిన పలు పోస్టుల ద్వారా శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు:

"ఈ రోజు నేను నవా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియాన్ని ప్రారంభించాను. ఇది ఛత్తీస్‌గఢ్ గిరిజన వర్గాల అజేయ ధైర్యం, త్యాగం, దేశభక్తికి అంకితమైంది. మ్యూజియంను సందర్శించడంతో పాటుగా అమరవీరుడు వీర్ నారాయణ్ సింగ్ స్మారక చిహ్నాన్ని ప్రారంభించి, ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించే భాగ్యం నాకు లభించింది."

"నవా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో నిర్వహించిన రజతోత్సవ ప్రదర్శనలో ఛత్తీస్‌గఢ్ రెండున్నర దశాబ్దాల అభివృద్ధి ప్రయాణాన్ని వీక్షించడం నాకు చాలా సంతోషం కలిగించింది."

"ఛత్తీస్‌గఢ్‌లోని నిరుపేద కుటుంబాలకు చెందిన నా సోదరీసోదరులను కలవడం నాకు చాలా సంతృప్తినిచ్చింది. వారికి ఇప్పుడు శాశ్వత గృహాలు లభించాయి. వారు ఇళ్ల తాళాలు అందుకున్న తర్వాత ఇంటి యజమానులుగా వారి ముఖాల్లో ఆనందం స్పష్టంగా కనిపించింది."

"ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అవతరణ రజతోత్సవ సభ సందర్భంగా నన్ను ఆశీర్వదించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన నా కుటుంబ సభ్యులకు చాలా అభినందనలు!

"25 సంవత్సరాల కిందట ఛత్తీస్‌గఢ్ ఏర్పాటుతో పూజ్య అటల్ జీ నాటిన విత్తనాలు ఇప్పుడు అభివృద్ధి అనే మర్రి వృక్షంగా వికసించాయి. ఈ సమయంలో ఇక్కడి నా సోదరీసోదరులు నన్ను గర్వపడేలా చేసే లెక్కలేనన్ని విజయాలను సాధించారు!"

"ఛత్తీస్‌గఢ్‌లోని మన గిరిజన సమాజం భారత వారసత్వ పరిరక్షణకు, అభివృద్ధికీ సాటిలేని కృషి చేసింది. ఈ రోజు ప్రారంభించిన అమరవీరుడు వీర్ నారాయణ్ సింగ్ స్మారక చిహ్నం, గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం వారికి అంకితం. ఇది రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది."

"పదకొండు సంవత్సరాల కిందట ఛత్తీస్‌గఢ్‌ను, మొత్తం దేశాన్నీ నక్సలైట్లు, మావోయిస్టుల తీవ్రవాదం నుంచి విముక్తి చేస్తామని మేం ప్రతిజ్ఞ చేశాం. దాని ఫలితాలను ఈ రోజు దేశమంతా చూస్తోంది. దశాబ్దాలుగా ఈ తీవ్రవాదానికి బలమైన స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని ప్రాంతాలు ఈ రోజు అభివృద్ధికి ఆనవాలుగా నిలవడం నాకు సంతోషం కలిగిస్తోంది."

# పత్తి కొనుగోలులో నిబంధనలు పాటించాలి

అమరావతి, నవంబర్ 3:పత్తి కొనుగోలులో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ రోజు మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని వెంకటేశ్వర కాటన్ మిల్ లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారి షాహబోద్దీన్, సీసీఐ అధికారులు, మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.

2025- 26 సంవత్సరంలో మద్దతు ధర క్రింద సీసీఐకు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈసారి ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 స్థాయిలలో స్లాట్ బుకింగ్ చేయడం జరుగుతుందని, ప్రతి స్థాయిలో 75 శాతం స్లాట్ లు బుక్ అయిన తర్వాత స్థాయిలో బుకింగ్ ఓపెన్‌అవుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుండి 12 తేమ శాతం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని సూచించారు.

ఆధార్ నంబర్ అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగవలసి ఉంటుందని తెలిపారు.

క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసిన రైతుల నుండి కొనుగోలు చేయడం జరుగుతుందని, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి సమన్వయంతో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పత్తి కొనుగోలుతో పాటు వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో చేపట్టడం జరుగుతుందని, రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, ఏ ఓ శ్రీకాంత్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్ పర్యటన ముఖ్యాంశాలను పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 3:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఛత్తీస్‌గఢ్ లో తన పర్యటన ముఖ్యాంశాలను పంచుకున్నారు.

నయా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో తన రోడ్‌షో సందర్భంగా ప్రజలు చూపిన ఆప్యాయత, ఉత్సాహానికి ప్రధానమంత్రి 'ఎక్స్' వేదికగా చేసిన వరుస పోస్టుల ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఇలా పేర్కొన్నారు:

"ఛత్తీస్‌గఢ్‌లోని నయా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో జరిగిన రోడ్ షోలో నా కుటుంబ సభ్యులు ఆప్యాయత, ఉత్సాహంతో పాటు వారి సాంస్కృతిక సంప్రదాయాలతో నన్ను స్వాగతించిన తీరు అద్భుతం."

నయా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో ఛత్తీస్‌గఢ్ శాసనసభ నూతన భవనాన్ని ప్రారంభించే అదృష్టం తనకు లభించిందని శ్రీ మోదీ పంచుకున్నారు. హరిత భవనం భావనతో నిర్మించిన ఈ కొత్త భవన సముదాయం సౌరశక్తితో పని చేయడమే కాకుండా వర్షపు నీటినీ సంరక్షిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇలా వ్యాఖ్యానించారు:

అభివృద్ధి చెందిన ఛత్తీస్‌గఢ్' దిశగా రాష్ట్ర ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయడానికి నయా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర నూతన శాసనసభ భవనాన్ని ప్రారంభించే అదృష్టం నాకు లభించింది. హరిత భవనం భావనతో నిర్మించిన ఈ భవనం సౌరశక్తిని ఇంధనంగా ఉపయోగిస్తూ... వర్షపు నీటినీ సంరక్షిస్తుంది.

నయా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. ఈ విగ్రహం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీ మోదీ ఇలా వ్యాఖ్యానించారు:

ఈ రోజు ఛత్తీస్‌గఢ్‌లో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించే అదృష్టం నాకు లభించింది. నయా రాయ్‌పూర్ అటల్ నగర్‌లోని ఈ విగ్రహం రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఈ సమయంలో, 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా నేనూ మొక్కలు నాటాను.

నయా రాయ్‌పూర్‌లోని శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో పిల్లలతో సంభాషణ చాలా ప్రత్యేకమైనదని, తన హృదయాన్ని ఉప్పొంగేలా చేసిందని ప్రధానమంత్రి పంచుకున్నారు. పుట్టుకతో వచ్చే గుండె జబ్బులను విజయవంతంగా అధిగమించిన పిల్లలను కలిసే అవకాశం తనకు లభించిందన్నారు. వారి ఉత్సాహం, సానుకూలత తనలో కొత్త శక్తిని నింపాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంలో ఆయన ఇలా పేర్కొన్నారు:

ఛత్తీస్‌గఢ్‌లోని నయా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో ఈరోజు పిల్లలతో జరిగిన సంభాషణ చాలా ప్రత్యేకమైనది, నా హృదయాన్ని కదిలించింది. శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో గుండె జబ్బులను అధిగమించిన ధైర్యవంతులైన పిల్లలతో మాట్లాడే భాగ్యం నాకు లభించింది. ఉత్సాహం, సానుకూల ధోరణి నిండిన వారి మాటలు నాలో నూతన శక్తిని నింపాయి.

నూతన శాసనసభ భవనం ప్రారంభోత్సవంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడం పట్ల శ్రీ మోదీ సంతోషం వ్యక్తం చేశారు. వారి ఆనందం ఛతీస్‌గడ్ అవతరణ దినోత్సవ 25వ వార్షికోత్సవ వైభవాన్ని రెట్టింపు చేసిందన్నారు. ఈ సందర్భంలో శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు:

ఛత్తీస్‌గఢ్ నూతన శాసనసభ భవన ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో విచ్చేసిన నా కుటుంబ సభ్యుల ఆనందం రాష్ట్ర అవతరణ దినోత్సవ 25వ వార్షికోత్సవ వైభవాన్ని మరింత పెంచింది.

నయా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో బ్రహ్మ కుమారీస్ ధ్యాన కేంద్రం 'శాంతి శిఖర్' ప్రారంభోత్సవం గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. "ఈ కేంద్రం గొప్పతనం ఆధునికత, ఆధ్యాత్మికతలు రెండింటిలోనూ ప్రతిబింబిస్తుంది. ధ్యానం, స్వీయ-సాక్షాత్కారం, ప్రపంచ శాంతికి ఇది ఒక ముఖ్య కేంద్రంగా ఆవిర్భవిస్తుంది" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో శ్రీ మోదీ ఇలా అన్నారు:

నయా రాయపూర్ అటల్ నగర్‌లో బ్రహ్మకుమారి ధ్యాన కేంద్రం 'శాంతి శిఖర్' ప్రారంభించే భాగ్యం నాకు లభించింది. ఈ కేంద్రం గొప్పతనం దాని ఆధునిక, ఆధ్యాత్మిక స్వభావంలో ప్రతిబింబిస్తుంది. ఈ ఆధ్యాత్మిక ఉద్యమం మర్రి చెట్టులా విస్తరించడాన్ని మనం చూశాం. ఈ ఆధ్యాత్మిక సంస్థ ఆధ్యాత్మిక సాధన, స్వీయ-సాక్షాత్కారం, ప్రపంచ శాంతికి ప్రధాన కేంద్రంగా మారుతుందని నాకు నమ్మకం ఉంది."

## 20 నెలల్లోనే రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు

మంథని, నవంబర్ 3: ప్రపంచ పటంలో హైదరాబాదను అత్యున్నత స్థానంలో నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ రోజు జూబ్లీహిల్స్ లో మంత్రి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 20 నెలల వ్యవధిలోనే రూ. 3.2 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూనే.. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తున్నామన్నారు.

# ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలి..



హైదరాబాద్, నవంబర్ 3: హుజూర్‌నగర్ పట్టణంలోని మఠంపల్లి బైపాస్ రోడ్‌లో వ్యవసాయ కళాశాలకు, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ రోజు అఖిలపక్ష రైతుసంఘం ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి వినతిపత్రం అందించారు. ఈ రోజు హైదరాబాద్‌లో మంత్రిని బాధిత రైతులతో కలిసిన రైతుసంఘం నాయకులు భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.30 లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు, బావికి మూడు లక్షలు, బోరుకు రెండు లక్షల పరిహారం, పశువుల కొట్టం, పశువుల జీవులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ మెమోరాండం ఇవ్వటం జరిగింది. మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ ఇందిరమ్మ ఇల్లు, ప్రతి కుటుంబంలో ఒక జాబు తప్పక ఇస్తానని, వీటితో పాటు ఎకరాకు 30 వేల నష్టపరిహారం విషయంపై ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు కాకి అజయ్, పశ్యపద్మ, కొప్పోజు సూర్యనారాయణ, కంబాల శ్రీనివాస్, ప్రభులింగం నరేంద్రప్రసాద్, దేవరం మల్లేశ్వరి, రైతులు చెన్నగాని సైదులు, పోలగాని సైదులు, పశ్యలక్ష్మి, ఇందిరాల రమేష్, సోమగాని కృష్ణమూర్తి, వారణాసి నాగరాజు, జెనిగ నాగమణి, చెన్నగాని శ్రీను, మామిడి బెంజి, గోసుల నరసింహ, లక్ష్మి, కటారి లింగయ్య, రవి, వెంకన్న వీరమ్మ, సైదులు లింగరాజు పాల్గొన్నారు.

# భగవద్గీత చదివితే సర్వం తెలుస్తుంది..

**–ఈనెల 23న భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు**
**–తి.తి.దే.ధర్మకర్తల మండలి సభ్యులు**

నంద్యాల,నవంబర్ 3: గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న భగవద్గీత కంఠస్థ పఠణ పోటీలలో భాగంగా ఈ సంవత్సరం నంద్యాల జిల్లాకు గాను ఈనెల 23వ తేదీన డోన్ పట్టణంలోని శ్రీసుధా విద్యాసంస్థల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం నందు ఆవిష్కరించారు.




విద్యార్థులకు బాల్యం నుండే భగవద్గీత నేర్పడం వల్ల విద్యార్థుల్లో నైతిక విలువలు పెరగడంతో పాటు, మనోధైర్యం కూడా పెరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ "ప్రతి ఇంటా భగవద్గీత – ప్రతి నోటా భగవద్గీత'' అని సంకల్పించుకోవాలన్నారు. ఈ సంవత్సరం పోటీల విధివిధానాలు మూడు విభాగాలుగా నిర్వహించనున్నారని, 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగం మొత్తం 27 శ్లోకాలు, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగయోగం మొత్తం 24 శ్లోకాలు,18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు వారికి "నిత్యజీవితంలో భగవద్గీత–భావ విశ్లేషణ" అనే అంశంపై ఈ పోటీలు నంద్యాల జిల్లాకు, కర్నూలు జిల్లాకు విడివిడిగా పోటీలు నిర్వహించబడునని, త్వరలో కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న పోటీల తేదీని ప్రకటించనున్నామని తెలిపారు.

## బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు ..

మక్తల్, నవంబర్ 3: కర్ణాటకలోని రాయచూరు నుండి హైదరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు బైకును ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం నల్లగట్టు సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

కర్ణాటకలోని దుప్పల్లి గ్రామానికి చెందిన హనుమంతు, ఆశమ్మ మోటార్‌సైకిల్‌పై తమ కుమారుడు మంజునాథ్‌తో కలిసి కర్ణాటకలోని బంధువుల ఇంటికి దేవసూర్ గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా నల్లగట్టు వద్ద వెనుకవైపు నుండి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హనుమంతు (45), ఆశమ్మ (42)లకు తీవ్ర గాయాలు అయ్యాయి. మంజునాథ్‌తో పాటు మూడేళ్ల బాలుడికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై మాగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# తెలంగాణ రాష్ట్రంలో మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను పొడిగింపు

## -కాల్పుల విరమణపై మావోయిస్టు పార్టీ కీలక నిర్ణయం

వరంగల్, నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కాల్పుల విరమణపై మావోయిస్టు పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను పొడిగిస్తూ మావోయిస్టు పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో లేఖ విడుదలైంది. తెలంగాణలో శాంతియుత వాతావరణం కొనసాగాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని.. అందుకు తెలంగాణ సర్కార్ కూడా స్పందించిందని పేర్కొంది. ఈక్రమంలో గత మే నెలలో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటించామని తెలిపింది. ఇదే విధంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ లేఖలో వెల్లడించింది.

లేఖలో ముఖ్యాంశాలు:

కాల్పుల విరమణను మరో 6 నెలల పాటు కొనసాగిస్తున్నామని.. గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక వర్గాలు శాంతియుత వాతావరణం కొనసాగాలని పెద్దఎత్తున ఉద్యమాలు చేశారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించింది.ఈ క్రమంలో గత మే నెలలో తాము 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటించాం.ఈ 6 నెలల కాలంలో అనుకున్న పద్ధతులను మా వైపు నుంచి అమలు జరిపి శాంతియుత వాతావరణం కొనసాగేలాగా వ్యవహరించాం.ఇదే శాంతియుత వాతావరణం కొనసాగాలని తెలంగాణ సమాజం కోరుకుంటోంది.కావున ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరో 6 నెలల పాటు కాల్పుల విరమణను ప్రకటిస్తున్నాం.గతంలో కొనసాగిన విధంగానే మా వైపు నుంచి శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషిచేస్తాం.ప్రభుత్వం వైపు నుంచి కూడా గతంలో వ్యవహరించిన విధంగానే ఉండాలని కోరుతున్నాం.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ఇటువంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని పార్టీలు, అన్ని సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరుతున్నట్లు మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేరుతో లేఖ విడుదల అయ్యింది.

# హుజురాబాద్ ఆసుపత్రి నెలకొన్న సమస్యలను పరిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

## - బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...

కరీంనగర్, నవంబర్ 3: (నేటినిజం ప్రతినిధి) హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఆ దిశగా తగిన చర్యలు చేపట్టారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రోజున హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని స్థానిక బిజెపి శ్రేణులతో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నీ బిజెపి ఆధ్వర్యంలో సందర్శించిన సమయంలో ఇక్కడి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వైద్యులు తెలియజేశారని, ఆ సమస్యలను బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్తే ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. నేడు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఒక కోటి 50 లక్షలు సి ఎస్ ఆర్ నిధులతో15 రకాల అవసరమైన వైద్య పరికరాలను , సామాగ్రిని అందించారని తెలిపారు. సోమవారం రోజున హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని స్థానిక బిజెపి శ్రేణులతో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1 కోటి 50 లక్షల సి ఎస్ ఆర్



నిధులతో 15 రకాల విలువైన వైద్య పరికరాలు సామాగ్రిని ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అందించారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కి హుజురాబాద్ బిజెపి పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా ప్రస్తుతం మెడికల్ కళాశాలకు కేటాయించినందున, అక్కడి ఆసుపత్రిని హుజురాబాద్ కు హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఇక్కడి ప్రాంతంలోని ప్రజలకు ఎంతో ముఖ్యమైందని , అలాంటి ఆసుపత్రి అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి తరలించడానికి చర్యలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇక్కడి ప్రాంతానికి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని తరలిస్తే హుజురాబాద్ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా హుజురాబాద్ మీదుగా వెళుతున్న నేషనల్ హైవే ప్రయాణికులకు కూడా అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇక్కడి ప్రాంతంలోని పేద మధ్యతరగతి ప్రజల ను దృష్టిలో ఉంచుకొని మెరుగైన వైద్య సేవలు అందించడానికి , రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నీ హుజురాబాద్ కు తరలించే విషయంలో కూడా ఆలోచన చేసి , ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో బిజెపి హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు మాజీ ఫ్లోర్ లీడర్ పైళ్ళ వెంకట్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ బిజెపి సీనియర్ నాయకులు యాంసాని శశిధర్ సబ్బని రమేష్ యాళ్ల సంజీవ్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి కొండాల్ రెడ్డి కొలిపాక వెంకటేష్ మహిళా మోర్చా అధ్యక్షురాలు వొడ్నాల చంద్రిక పల్లె వీరయ్య తాళ్లపల్లి దేవేంద్ర తాళ్లపల్లి హరీష్ తూర్పాటి రాజశకర్ పర్థం విజయ్ బాబర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్

## -విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజ రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ బిక్షాటన





రాజన్న సిరిసిల్ల, నవంబర్ 3: (నేటినిజం ప్రతినిధి): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని భిక్షాటన చేస్తూ సోమవారం వేములవాడ పట్టణం తెలంగాణ తల్లి చౌరస్తా లో నిరసన తెలిపారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికల పైన ఉన్న శ్రద్ధ విద్యార్థుల పైన ఎందుకు లేదని వారు అన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో మీ పిల్లలకు ఉన్నతమైన చదువులను అందిస్తానని హామీలు ఇస్తూ ,ప్రస్తుతం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్లు రియంబర్స్మెంట్లు ఎందుకు ఇవ్వడంలేదని అన్నారు.

అధికారంలోకి రావడం కోసం మాయమాటలు చెబుతున్నారు ఉప ఎన్నిక పైన ఉన్న శ్రద్ధ ఈ రాష్ట్రంలో ఉన్న విద్యార్థుల పైన ఎందుకు లేదు,స్కాలర్షిప్లు రియంబర్స్మెంట్లు పైన ఆధారపడి చదివే విద్యార్థులు పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనబడడం లేదా ? కళాశాలలకు విద్యార్థులు వెళ్లి సర్టిఫికెట్లు ఇవ్వమని అడిగితే రియంబర్స్మెంట్ మీరే కట్టాలని వేధిస్తున్న పరిస్థితి యాజమాన్యాలు వ్యవహరిస్తున్నారు.దీని ద్వారా విద్యార్థుల భవిష్యత్తు రోడ్ల పైన పడుతున్న పరిస్థితి. విద్యార్థులు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ రాకపోవడం ద్వారానే రోడ్ల మీదికి వచ్చి అనేక ఆందోళనలో పోరాటాలు చేస్తూ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అణచివేసే కుట్ర పన్నుతుంది తప్ప విద్యార్థుల సమస్యని పరిష్కరించడంలో ఏమాత్రం కూడా ముందుకు పోవడం లేదని వారు ఆరోపించారు, గత ప్రభుత్వం చేసిన తప్పునే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వారసత్వంగా ముందుకు తీసుకు వెళ్తూ విద్యార్థుల జీవితాలను చిక్కుల్లో పెట్టే ప్రయత్నం చేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తూ ఉంటే ప్రజలు సంపూర్ణంగా మాకు తెలియజేస్తూ మీ పోరాటాల్లో మేము కూడా భాగస్వామ్యం అవుతామని విద్యార్థులకు నాయకులకు ధైర్యం చెబుతూ పోరాటాలను కొనసాగివ్వాలని ప్రజలు భారీ సంఖ్యలో చేపట్టిన భిక్షటన లో తెలియజేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి విద్యార్థులకు రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు ప్రభుత్వ విప్ గా అది శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు జిల్లాలో ఎంతో మంది విద్యార్థులు వారి చదువులకు దూరం అవుతున్న సంగతి వారికి ప్రత్యక్షంగా తెలుసు దీన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లే విధంగా కృషి చేయాలని, దీనిపైన నిర్ణయం తీసుకొని విద్యార్థులకు రావాల్సిన బకాయిలను విడుదల చేసే విధంగా వారు పని చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కడారీ శివ, నాయకులు సాయికుమార్ , నందిని , నాగరాణి తదితరులు పాల్గొన్నారు...

# పెండింగ్ -ఫీజు రీయింబర్స్ మెంట్స్ -స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చేయాలి

## -ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేత

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 3: (నేటినిజం ప్రతినిధి): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజున వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారికి పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజురీయంబర్స్ మెంట్స్ మరియు స్కాలర్ షిప్స్ గత ఆరేళ్ల నుండి ప్రభుత్వం చెల్లించడం లేదు. 2023-2024 - విద్యాసంవత్సరం 2100కోట్లు,2024 -2025 విద్యాసంవత్సరం -2100 కోట్లు ,2025-2026 -విద్యాసంవత్సరం 2200 కోట్లు మొత్తం 6,300 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర నుండి విద్యార్థులకు ఇవ్వాలసిన



ఫీజులు, అలాగే గత ప్రభుత్వం హయంలో 4100 కోట్లు బకాయిలు ఉన్నాయి. మొత్తం 10,500 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటిలో దసరా కంటే ముందు ప్రభుత్వం యాజమాన్యాలు సమ్మె సందర్భంగా చర్చలు జరిపి దసరాకు 300 కోట్లు, దీపావళి -900 కోట్లు, నవంబర్ నెలలో -300 కోట్లు, మొత్తం 1200 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వాటిలో 300కోట్లు చెల్లించారు. మిగతా బకాయిలు చెల్లించలేదు. ఫలితంగా విద్యార్థులే ఫీజులు చెల్లించుకుం టున్నారు.ప్రభుత్వ కళాశాలలో, హాస్టల్స్ ఫీజులను కూడా వారే చెల్లిస్తున్నారు. ఇంకోప్రక్క ప్రైవేటు యాజమాన్యాలు కూడా వారి ఇబ్బందులు రీత్యా సమ్మెలోకి వెళ్ళాలి. కావున మీరు ప్రభుత్వంతో చర్చించి ఫీజులను విడుదల చేయించేలాగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని తెలిపారు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పెండింగ్ బకాయిల విడుదల కోసం కృషి చేస్తామని తెలిపారుఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కడారి శివ, నాయకులు భరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

### 19 మంది ప్రాణాలు కోల్పోగా..కే తల్లికి పుట్టిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి

చేవెళ్ల నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టిన విషయం తెలిసిందే ఈ దుర్ఘటనలో ఇప్పటి వరకూ 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. కొందరు తల్లిదండ్రులను కోల్పోగా.. మరికొందరు తమ పిల్లల్ని కోల్పోయారు. ఇక ఈ ఘటన ఓ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. ఒకే తల్లికి పుట్టిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు రోడ్డు ప్రమాదంలో మరణించారు.వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉండే ఎల్లయ్య గౌడ్‌కు ముగ్గురు కుమార్తెలు నందిని, సాయిప్రియ, తనూష ఉన్నారు. వారు హైదరాబాద్‌లో చదువుతున్నారు. ఇటీవలే బంధువులు పెళ్లి ఉండటంతో సొంతూరికి వచ్చారు. వేడుకలను ముగించుకొని నగరానికి పయనమయ్యారు. ముగ్గురూ ఇవాళ ఉదయం బస్సులో బయల్దేరారు. ఎంతో సంతోషంగా ఉన్న వారిని మృత్యువు కబళించింది. పెళ్లివేడుకలో సందడిగా గడిపిన అక్కాచెల్లెళ్లు ముగ్గురూ ఇవాళ విగత జీవులుగా మారారు. బస్సు ప్రమాదంలో స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో ముగ్గురు కుమార్తెలు మరణించడంతో తండ్రి ఎల్లయ్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# వృద్ధుని అంత్యక్రియలకు వెస్సో సహాయం

హైదరాబాద్ నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుగ్గాడ గ్రామంలో బిసి కాలనీకి చెందిన జవాదుల సూర్యనారాయణ(65), భార్య సత్యవతి(60) ఒక పూరిపాకలో నివసిస్తున్నారు. కార్పెంటర్ గా పనిచేసిన సూర్యనారాయణ గత కొన్ని సంవత్సరాలుగా పక్షవాతానికి గురై, మంచానికి పరిమితమై, ఇటీవల శివైక్యం చెందారు. వారి అంత్యక్రియలు పూర్తి చేయడం సత్యవతికి భారంగా మారింది. వారి యొక్క పెళ్లి అయిన కొడుకు సరిగా చదువుకోలేదు, తెలివితేటలు తక్కువ. చిన్న జీతానికి హైదరాబాద్ లో ఒక హాస్టల్లో చిరుద్యోగం చేస్తున్నాడు. తండ్రి అంత్యక్రియల ఖర్చులు భరించడం అతనికి కూడా సాధ్యం కావడం లేదు! పెళ్లయిన ఇద్దరు కుమార్తెలలో ఒక కుమార్తె కాలం చేశారు. మరో కుమార్తె పరిస్థితి కూడా అంతంత మాత్రం. ఈ పరిస్థితుల్లో పాలుపోని సత్యవతి స్థానిక నాయకుల ద్వారా సహాయానికై వెస్సో ట్రస్ట్ ను ఆశ్రయించారు. వెస్సో ట్రస్ట్ గౌరవ దాతల సహకారంతో స్థానిక నాయకుల ద్వారా సత్యవతికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

# బాసర సరస్వతి సన్నిధి లో శ్రీ సరిత లకు ఉత్తమ సాంస్కృతిక నాట్య సేవ పురస్కారము

బాసర నవంబర్ 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపము లో శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము( కోటి పార్థివలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము ) మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమములు, అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవం గా జరిగినవి. ముందుగా దీపారాధన ,కలశస్థాపన, పుణ్యాహవచనము ,లక్ష్మీ గణపతి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య, కోటి పార్థివ లింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకము , కుంకుమార్చన ,గణపతి, నవగ్రహ ,రుద్ర ,సరస్వతి హోమములు, భూదాన సంకల్ప పూజ, మరియు అన్నదానము ఘనంగా నిర్వహించారు. .సాంస్కృతిక కార్యక్రమములో భాగంగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గణించిన జగ్గయ్య పేట వాస్తవ్యులుశ్రీ త్రినేత్ర ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు నాట్యాచార్యులు శ్రీ భారతి కి మరియు హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ అపరాజిత నాట్య గురుకుల వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ సరితశ్రీ లకు ఉత్తమ ఆధ్యాత్మిక సాంస్కృతిక నాట్య సేవ పురస్కార ప్రదానోత్సవం ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికా నాథ శర్మ సంధ్య దంపతులు .అందజేశారు. నాట్యాచార్యులు శిష్యులు చక్కని నృత్యాభినయముతో కళా ప్రియులను కట్టిపడేశారు. పదాలకు అనుగుణముగా అడుగులు వేస్తూ భావాలకు అద్దం పట్టేలా అభినయిస్తూ ప్రదర్శించిన నృత్యాంశములు అందరినీ ఆకట్టుకున్నాయి.ప్రతి నెల మూడవ ఆదివారము మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమంలో భాగంగా ఉచితముగా ఎలాటి ఎంట్రీ ఫీ తీసుకోకుండా నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నామని తెలిపారు.

# డయాబెటిస్ ఉన్నవారు నారింజ పండ్లు తినవచ్చు..



హైదరాబాద్ నవంబర్ 3 (ఎక్స్ ఒప్రెస్స్ న్యూ స్);నారింజ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. చలికాలం సీజన్ లో ఇవి మనకు మార్కెట్‌లో ఎక్కువగా దర్శనమిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అత్యధిక మొత్తంలో లభించే పండ్లలో నారింజ పండు కూడా ఒకటి. నారింజ పండ్లను అనేక రకాలుగా తీసుకోవచ్చు. వీటిని నేరుగా అలాగే తినవచ్చు. లేదా జ్యూస్ చేసి తాగవచ్చు. ఇతర పండ్లతో కలిపి సలాడ్ రూపంలోనూ తినవచ్చు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి నారింజ పండ్లను తినాలని వైద్యులు చెబుతుంటారు. ఈ పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. రోజూ కచ్చితంగా ఒక నారింజ పండును తినాలని, దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు సైతం సూచిస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరు ఈ పండ్లను కచ్చితంగా రోజూ తినాలని వారు చెబుతున్నారు.

విటమిన్ సి..

నారింజ పండ్లలో అధిక మొత్తంలో విటమిన్ సి ఉంటుంది. విటమిన్ సి అధికంగా లభించే పండ్లలో నారింజ పండు ముందు వరుసలో నిలుస్తుంది. ఒక మీడియం సైజు నారింజ పండును తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది. విటమిన్ సి వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు తగ్గుతాయి. విటమిన్ సి వల్ల చర్మానికి సైతం ఎంతో మేలు జరుగుతుంది. ఇది శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు.


గుండె ఆరోగ్యానికి..

నారింజ పండ్లను తినడం వల్ల విటమిన్ బి6 అధికంగా లభిస్తుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి నారింజ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. రోజూ ఒక నారింజ పండును తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లను తింటుంటే కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నారింజ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణశక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

డయాబెటిస్ ఉన్నవారు కూడా..

డయాబెటిస్ ఉన్నవారు సైతం నారింజ పండ్లను తినవచ్చు. ఇందులో భయం చెందాల్సిన పనిలేదు. నారింజ పండ్లను తింటే షుగర్ పెరుగుతుందని అనుకుంటారు. కానీ ఇది అపోహే. ఇందులో నిజం లేదు. ఎందుకంటే నారింజ పండు గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ 40గా ఉంటుంది. అందువల్ల ఈ పండును తింటే షుగర్ లెవల్స్ అమాంతం పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా ఈ పండ్లను రోజూ తినవచ్చు. ఇందులో సందేహించాల్సిన పనిలేదు. ఇక ఈ పండ్లలో సిట్రేట్స్ అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కిడ్నీల్లో స్టోన్లు ఏర్పడకుండా చూస్తాయి. అందువల్ల కిడ్నీ స్టోన్లు ఉన్నవారికి మేలు జరుగుతుంది. అలాగే మూత్రం పీహెచ్ స్థాయిలు సరైన రీతిలో ఉంటాయి. దీని వల్ల మూత్రాశయం, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా నారింజ పండును రోజుకు ఒకటి చొప్పున తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# తన గెలుపుకు కృషి చేసిన అభిమానికి బైక్ అందజేసిన ప్రభుత్వ విప్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 3: (నేటినిజం ప్రతినిధి): తన అభిమాన నాయకుడు ఆది శ్రీనివాస్ వేములవాడ ఎమ్మెల్యే గా గెలువాలని వేములవాడ పట్టణం నాంపల్లి కి చెందిన కదురు బాలయ్య గత ఎన్నికల్లో తను నిత్యం అమ్మే కూరగాయల బండిని తన ప్రచార సాధనంగా చేసుకొని మైక్ లో జననేత ఆది శీనన్నను గెలిపించండి అంటూ తిరుగుతూ ప్రచారం నిర్వహించారుప్రజా ఆశీర్వాదంతో ఆది శ్రీనివాస్ వేములవాడ ఎమ్మెల్యే గా విజయం సాధించి ప్రభుత్వ విప్ గా నియామకం కబడి నిత్యం ప్రజల మధ్య ఉంటున్న విషయం తెలిసిందే..గతంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాన్ నాంపల్లిసాల రామన్నపల్లి లో కదూరు బాలయ్య ఇంటికి వెళ్లి వారి దంపతులకు నూతన వస్త్రాలు అందజేశారు.. తన ఎన్నికల్లో మైక్ ద్వారా ప్రచారం చేసి గెలుపులో భాగస్వామ్యం కావడం పట్ల ధన్యవాదాలు తెలిపారు..అ సమయంలో తన బైక్ పాడైపోయిన విషయం ప్రభుత్వ విప్ కు తెలుపుగా వెంటనే కదురు బాలయ్యకు నూతన బైక్( ఎక్సెల్) ను ప్రభుత్వ విప్ కొనిచ్చి సోమవారం అందజేయడం జరిగింది...

# ప్రపంచ కప్ గెలిచిన భారత క్రికెట్ జట్టుకు అభినందనలు తెలిపిన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు




కరీంనగర్, నవంబర్ 3: (నేటినిజం ప్రతినిధి) స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలుచుకున్న సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి వేడుకలకు ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి ఎ నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా క్రికెట్ జట్టు సమిష్టిగా రాణిస్తూ ఎన్నో విజయాలను సొంతం చేసుకుంటున్నాయని చాలా చక్కటి సమన్వయంతో కోచ్ అమోల్ ముజుందార్ మార్గదర్శకమున వ్యాచ్లను గెలవడం చాలా హర్షించదగ్గ విషయమని వారు చెప్పారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా క్రికెట్ జట్టు అన్ని రంగాలలో చాలా గొప్పగా రాణించడమే కాకుండా టైటిల్ గెలవడమే లక్ష్యంగా కృషి చేసినదని మరియు పలు రికార్డులను తిరగ రాయడం చాలా గొప్ప విషయమని వారు హర్షం వ్యక్తం చేశారు.నిన్న ముంబైలో దక్షిణాఫ్రికా తో జరిగినటువంటి ఫైనల్ మ్యాచ్ లో ఓవరాల్ టీం గా అద్భుత ప్రదర్శన కనబరిచి విశ్వ విజేతగా నిలవడం చాలా గొప్ప విషయమని వారు చెప్పారు×.హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలో భారత మహిళా జట్టు అపూర్వ విజయాలు సాధించడం దేశానికే గర్వకారణమని ముఖ్యంగా సొంత గడ్డపై సొంత ప్రేక్షకుల మధ్య ఒత్తిడిని ఎదుర్కొని ఆల్ రౌండ్ షో తో రాణించి సగర్వంగా టైటిల్ ని గెలుచుకున్నదని తెలిపారు. జయధ్వనుల మధ్య విజేతగా నిలిచిన భారత జట్టుకు ప్రపంచంలోనే పలు దేశాల నుండి అభినందనలు వెలబడుతున్నాయని చెప్పారు.× ఈ విజయం భారతావని పండుగగా చేసుకున్నదని ప్రధానితో సహా ప్రముఖులందరూ భారత మహిళా క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలుపడం వారికి గొప్ప ఉత్సాహం ఇస్తుందని గుర్తు చేశారు. ప్రపంచ కప్ టైటిల్ ని గెలుచుకున్న సందర్భంగా స్వీట్లను పంచి ఆనందాన్ని రెట్టింపు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులందరూ జయహో భారత్ జయహో అనే నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com